క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి గురువారం విశేషపూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

వేంపెంటలో బ్రహ్మాస్త్రం తయారు



పొయ్యి మీద డబ్బాలో ద్రావణాన్ని పోస్తున్న మహిళలు

పాములపాడు: పంటల్లో చీడ పీడల నివారణకు ఉపయోగించే బ్రహ్మాస్త్రంను వేంపెంట యూనిట్ వీఓ సంఘం మహిళలు తయారు చేస్తున్నారని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు. బ్రహ్మాస్త్రం తయారీకి ఆవు మూత్రం 10 లీటర్లు, సీతాఫలం ఆకులు 2 కేజీలు, కానుగాకులు 2 కేజీలు, వేపాకులు 3 కేజీలు, ఉమ్మెత్త ఆకులు 2 కేజీలు, కాకర ఆకులు 2 కేజీల చొప్పున సేకరించి డబ్బాలో ఉడికించాలని చెప్పారు. ఇక్కడ నీమాస్త్రం కూడా తయారు చేస్తున్నట్లు చెప్పారు. కావాల్సిన రైతులు స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.. చీడ పీడలను నివారించడంతో పాటు పంట ఏపుగా పెరిగేందుకు బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం ఉపయోగపడుతుందని చెప్పారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పాములపాడు: స్థానిక ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కబడ్డీ, చెస్ పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గోపాల్ తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ అండర్–17 విభాగం కబడ్డీ పోటీల్లో షాలెంరాజు, ఆఫ్రిన్, జయశ్రీ, అండర్–14 లో దిల్‌రాజు, శివానంద్, మల్లేశ్వరి, చిట్టెమ్మ, చెస్ పోటీల్లో రాజకేష్ ప్రతిభ చూపారన్నారు. అనంతరం విద్యార్థుల విజయానికి కృషి చేసిన పీడీ రాజశేఖర్‌ను అభినందించారు.

అత్యాచారాలకు పాల్పడితే శిక్ష తప్పదు



దామగట్ల గ్రామ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ తిరుపాలు

నందికొట్కూరు: మహిళలు, బాలికలపై అత్యాచారాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు తెలిపారు. గురువారం మండలంలోని దామగట్ల గ్రామంలో పర్యటించి స్థానికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో అందరూ కలిసికట్టుగా ప్రశాంతంగా జీవనం సాగించాలని కోరారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించాలని తెలిపారు.

వ్యాసరచన పోటీలు



వ్యాస పోటీలను పర్యవేక్షిస్తున్న సీఐ ప్రసాద్‌రావు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్‌రావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన వారిని స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గురవయ్య, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు గస్తీని ఏర్పాటు చేయాలి



రద్దీగా ఉన్న ఆత్మకూరు బస్టాండు

ఆత్మకూరు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని విద్యార్థినులు కోరుతున్నారు. చదువుకునేందుకు గ్రామాల నుంచి పట్టణానికి ఉదయం, సాయంత్రం రాకపోకలు సాగిస్తున్నామని, ఆయా సమయాల్లో కొందరు అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని, సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీస్తున్నారని పలువురు విద్యార్థినులు వాపోయారు. పోలీసు గస్తీ పెంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

పరపతి ఉంటేనే గోకులం షెడ్డు

కూటమి ప్రభుత్వంలో గోకులం షెడ్లు అందటం కష్టంగా మారింది. అర్హులను పక్కకు పెట్టి పరపతి ఉన్న అనర్హులకే షెడ్లను కట్టబెడుతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హత ఉంటే చాలు.. సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకే అందేవి. ప్రస్తుత కూటమి పాలనలో పరపతిలేకపోయినా, పైసలు ఖర్చుచేయకపోయినా పథకాలు అందటం కష్టంగా మారింది.

– జూపాడుబంగ్లా

- తెలుగు తమ్ముళ్లకే అధిక ప్రాధాన్యత
- గతంలో ఇచ్చిన గోకులం షెడ్లకు వైఎస్సార్‌సీపీ హయాంలో బిల్లులు
- అర్హత ఉన్నా పరపతిలేకపోతే పథకం కష్టమే



బిల్లుల మంజూరు కోసం గోకులం షెడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏపీఓ గౌరీబాయి, సిబ్బంది

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి మండలాలకు కలిపి 195 యూనిట్లు మంజూరు కాగా నియోజకవర్గ వ్యాప్తంగా 450 మంది దరఖాస్తు చేసుకున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, శ్రీశైలం, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాలకు కలిపి 105 యూనిట్లు మంజూరయ్యాయి. పాడిపశువులకు 90 శాతం రాయితీ, గొర్రెలు, కోళ్లకు 70 శాతం రాయితీతో గోకులం షెడ్లు మంజూరయ్యాయి. రాయితీ అధికంగా ఉండటంతో దరఖాస్తులు అధికంగా వస్తున్నందున యూనిట్ల మంజూరును మరింగా పెంచే అవకాశాలున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 2014–19 మధ్య టీడీపీ పాలనలో నిర్మించుకొన్న గోకులం షెడ్లకు నిధులు మంజూరు చేయకపోవటంతో వైఎస్సార్‌సీపీ పాలనలో బిల్లులు మంజూరు చేయగా అప్పట్లో నిర్మించుకొన్న నిర్మాణాలను జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే బిల్లులు మంజూరు చేస్తున్నారు.

గోకులం షెడ్లకు రాయితీ ఇలా..

ఆరు పశువులకు యూనిట్ కాస్టు రూ.2.30 లక్షలు, నాలుగింటికి యూనిట్ విలువ రూ.1.85 లక్షలు, రెండింటికి యూనిట్ విలువ రూ.1.15 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తారు. అందులో 90 శాతం రాయితీ పోను 10 శాతం లబ్ధిదారుని వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. గొర్రెల పెంపకం దారులకు 50 జీవాలుంటే యూనిట్ ధర రూ.2.30 లక్షలు, 20 జీవాలకు యూనిట్ ధర రూ.1.30 లక్షలు కాగా అందులో 70 శాతం రాయితీ పోను 30 శాతం లబ్ధిదారుని వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. 200 కోళ్ల పెంపకం కోసం యూనిట్ ధర రూ.1.32 లక్షలు, 100 కోళ్ల కోసం యూనిట్ ధర రూ.87 వేలు కాగా 70 శాతం రాయితీ పోను 30 శాతం లబ్ధిదారుని వాటాగా చెల్లించాల్సి ఉంటుంది.

షెడ్ల నిర్మాణం కోసం చిన్న, సన్న కారు రైతులతో పాటు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు, ఎస్సీ, ఎస్టీలు, అంగవైకల్యం ఉన్న వారు, మహిళా యజమానులు అర్హులు.

లబ్ధిదారుల ఎంపిక ఇలా..

దరఖాస్తులను వెటర్నరీ డాక్టర్ పరిశీలించి అప్రూవల్ చేసి ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులకు పంపిస్తారు. వారు దరఖాస్తులను పరిశీలించటంతోపాటు సొంతస్థలంతోపాటు గ్రామసభ తీర్మానం పొంది ఉండాలి. దరఖాస్తుదారులకు షెడ్డు మంజూరు చేయాలంటే దరఖాస్తుతో పాటు, పాన్‌కార్డు, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, స్థల హక్కుపత్రం, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్సు కాపీలను జతచేయాల్సి ఉంటుంది.

పరపతి ఉంటేనే గోకులం షెడ్డు

పరపతి ఉన్న వారికే గోకులం షెడ్డు మంజూరు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యేల సిఫారసుతో తయారుచేసిన జాబితాలను అనుసరించి ఉపాధిహామీ పథకం అధికారులు దరఖాస్తుదారులకు గోకులం షెడ్లు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈనేపథ్యంలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయలేకపోతున్నామని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వాస్తవానికి మంజూరైన వాటికంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటుండటంతో మంజూరైన కొద్దిపాడి యూనిట్లు రెకమెండేషన్ ఉన్నవారికే సరిపోగా నిజమైన లబ్ధిదారులకు పథకం లభించని దుస్థితి నెలకుందనే విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లటంతో మరికొన్ని యూనిట్ల మంజూరుకు అధికారులు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

గతంలో నిర్మించుకున్న వాటికి ఇప్పుడు బిల్లులు

2014–2019 మధ్యకాలంలో టీడీపీ పాలనలో నందికొట్కూరు నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 480 గోకులం షెడ్లను లబ్ధిదారులు నిర్మించుకున్నారు. వాటికి బిల్లులు మంజూరు కాక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వాటికి గతేడాది బిల్లులు మంజూరు చేయటంతో వెటర్నరీ, ఉపాధిహామీ పథకం అధికారులు నిర్మాణం పూరైన గోకులం షెడ్లను పరిశీలించి అన్ని వివరాలు పక్కాగా ఉంటే బిల్లులు మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం మంజూరైన గోకులం షెడ్లు నిర్మించుకున్న తర్వాత సకాలంలో బిల్లులు మంజూరు అవుతాయా లేక గతంలో లాగా పెండింగ్ పడతాయా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నిజమైన పశుపోషకులకు న్యాయం చేయాలి



నాకు ఎలాంటి స్థిర, చరాస్తుల్లేవు. నాకు ఎనిమిది బర్రెలున్నాయి. వాటికి షెడ్డు వేసుకునే స్తోమత లేక ఆరుబయటే కట్టేస్తున్నాను. ఎండకు, వానకు తడుస్తూ ఉంటాయి. ప్రభుత్వం గోకులం షెడ్లు మంజూరు చేసిందని తెలిసింది. పరపతి ఉన్నవాళ్లకే షెడ్లు ఇస్తున్నట్లు తెలిసింది. మాలాంటోళ్లకు ఇస్తే బాగుంటుంది.

– కుమ్మరి రంగన్న, తాటిపాడు

రెకమెండేషన్ అవసరం లేదు



బర్రెలు, జీవాలు, కోళ్ల పెంపకం చేపట్టే వాళ్ల సొంత స్థలం ఉన్నట్లయితే ఎవ్వరి రెకమెండేషన్ లేకున్నా గోకులం షెడ్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. వెటర్నరీ డాక్టర్ పరిశీలించి పంపిన దరఖాస్తుతోపాటు అర్హత కలిగి గ్రామపంచాయతీ, మండల తీర్మానాలుంటే వారి వివరాల ఆధారంగా క్షేత్రస్థాయిలో ఏపీఓ, టీఏ, ఈసీలు పరిశీలించి యూనిట్లను మంజూరు చేస్తాం.

– అన్వరాబేగం, ఏపీడీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, నందికొట్కూరు

సంక్షేమ హాస్టళ్లలో వసతులు కరువు



బీసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఇందిరా ప్రియదర్శిని

నందికొట్కూరు: ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో వసతులు లేక విద్యార్థులు ఉండలేకపోతున్నారని సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. గురువారం పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో ఉన్న బీసీ సంక్షేమ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను గుర్తించి హైకోర్టుకు నివేదిక అందిస్తామన్నారు. హాస్టళ్లలో సమస్యలు తిష్టవేశాయని, విద్యార్థుల పరిస్థితులు దారుణంగా ఉన్నాయని చెప్పారు. వర్షాకాలంలో గదుల్లో ఉండేందుకు చాలా కష్టంగా ఉంటుందని పట్టణంలోని ఎస్సీ బాలికల, బీసీ బాలికల వసతి గృహాల విద్యార్థినులు చెప్పారన్నారు. వర్షాలకు గదులన్నీ కారుతుంటే వార్డెన్లు పట్టించుకునట్లు కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థలో ఉన్న సంక్షేమ హాస్టళ్ల గదులను తొలగించి నూతన భవనాలు నిర్మించాలని, బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లకు నీటి సౌకర్యాలు, తలుపులు లేవు, కనీస వసతులు లేవన్నారు. మరమ్మతులు చేయించాలని వార్డెన్లను ఆదేశించారు. కార్యక్రమంలో వార్డెన్లు మహేష్, కోర్టు ఉద్యోగులు ఉన్నారు.

నేటి నుంచి పశుగణన

జూపాడుబంగ్లా: నేటి నుంచి ఇంటింటికీ వెళ్లి పశుగణన చేపట్టనున్నట్లు పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజనేయనాయక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల అనంతరం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నేటి నుంచి పశువులు, జీవాలు, కోళ్ల గణన చేపట్టనున్నట్లు చెప్పారు. 2019 లెక్కల ప్రకారం మండలంలో 9,009, పగిడ్యాల మండలంలో 8,789 హౌస్ హోల్డ్స్ ఉన్నాయన్నారు. వాటిని అనుసరించి ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి పశువులు, జీవాలు, కోళ్ల వివరాలు సేకరించి నమోదు చేస్తారన్నారు. ఎన్యూమరేటర్లు నమోదుచేసే వివరాలను జూపాడుబంగ్లా, పగిడ్యాల మండలాల్లో ఐదుగురు సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తారన్నారు.

పగిడ్యాల: మండల వ్యాప్తంగా పది గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం ప్రారంభమవుతుందని పాతముచ్చుమర్రి, పగిడ్యాల, పడమర ప్రాతకోట పశువైద్యులు డాక్టర్ రాగసంధ్య, శృతికీర్తి, మండ్ల సుమన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పశుగణన విషయ సేకరణ కోసం వచ్చే అధికారికి సహకరించి పశువుల సమాచారం అందించాలని కోరారు. పలు జాతులకు చెందిన పెంపుడు జంతువులు, కోళ్లు, ఇతర జీవజాతుల వయస్సు, లింగం తదితర వివరాలను సేకరించి స్టిక్కర్ వేస్తారని అనంతరం డిజిటలైజేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

గిరిజన భూములను రక్షించాలి

కొత్తపల్లి: గిరిజన గూడేల్లో చెంచు గిరిజనుల భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని పరిరక్షించాలని, ఆధార్ కార్డు లేక గిరిజనులు ప్రభుత్వ పథకాలకు దూరం అవుతున్నారని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి యేసురత్నం, మండల నాయకులు ఎన్.స్వాములు కోరారు. గురువారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. చెంచు గిరిజనులకు అప్పటి ప్రభుత్వాలు అటవీ హక్కుల చట్టం కింద భూములు ఇచ్చాయన్నారు. ఆ భూములు కొంతమంది అక్రమార్కుల వల్ల అన్యాక్రాంతమయ్యాయన్నారు. మరికొన్ని గూడెంలలో చెంచుల జీవనోపాధి కోసం ఉన్న భూములు నేటికీ దళారుల చేతుల్లోనే ఉన్నాయన్నారు. మండలంలోని జానాలగూడెం, మాడుగుల, పెద్ద గుమ్మడాపురం, ముసలమడుగు, శివపురం, కొత్తపల్లి తదితర చెంచు గూడేల్లో అనేక మంది గిరిజనులకు ఆధార్ కార్డులు లేకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

- ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాస రెడ్డి

మహానంది: కార్తీక మాసంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాటు చేస్తామని మహానంది ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలోని ఆది, సోమవారాల్లో క్యూ లైన్లో వేచి ఉండే భక్తులకు దాతల సహకారంతో పాలు అందిస్తామన్నారు. రుద్రగుండం కోనేరులో పుణ్యస్నానాలకు అనుమతిస్తామని వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని చెప్పారు. ఆది, సోమవారాల్లో సామూహిక కేదారేశ్వర వ్రతాలు(నోములు), సామూహిక అభిషేకాలు ఉంటాయన్నారు. నవంబర్ 2న సాయంత్రం ఆకాశ దీప ప్రారంభం ఉత్సవం, 15 కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం, 29న లక్ష బిల్వార్చన, 30న లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణోత్సవం ఉంటాయన్నారు. సమావేశంలో ఏఈఓ ఎరమల మధు, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దన్ శర్మ పాల్గొన్నారు.


రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న సీఐలు సురేష్‌కుమార్ రెడ్డి, ఓబులేషు

ఆత్మకూరురూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎస్పీ రామాంజి నాయక్ అన్నారు. పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో డీఎస్పీ మాట్లాడారు. ఎందరో పోలీసులు విధి నిర్వహణలో తమ ప్రాణాలు సైతం త్యజించారన్నారు. అలాంటి వారిని స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం సీఐలు సురేష్ కుమార్‌రెడ్డి, ఓబులేషుతోపాటు 123 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు హుస్సేన్‌బాషా, విష్ణునారాయణ, సురేష్, కేశవ, ఓబులేషు, ఆసుపత్రి ముఖ్య వైద్యాధికారి రాయుడు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



పంటను పరిశీలిస్తున్న ఏఓ

వెలుగోడు: రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏఓ పవన్ కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని గుంతకందాల గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వాడి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంట మొదటి దశలో ఆకు ముడత, కాండం తొలిచే పురుగుల నివారణకు వేప నూనె లీటర్ నీటిలో రెండు మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పాములపాడు: స్థానిక ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు గురువారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైబర్ క్రైం–యువత పాత్ర అనే అంశంపై పోటీలు నిర్వహించారు. 30 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, హెడ్ కానిస్టేబుళ్లు రామేశ్వర్, యర్రన్న పర్యవేక్షించారు. ఏఎస్‌ఆర్ జెడ్పీ హై స్కూలు నుంచి చరణ్‌నాయక్, సౌజన్య, చైతన్య వరుస స్థానాల్లో నిలిచారు. అలాగే ఏపీ మోడల్‌స్కూల్‌లో ప్రసన్న, సుజిత, మనీష ప్రతిభ చూపారు.

యూఎన్‌ఓ దినోత్సవం

నందికొట్కూరు: ప్రపంచ దేశాలను ఏకం చేసి శాంతియుతంగా అభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్లాలనే ఉద్దేశంతో యూఎన్‌ఓ ఏర్పడిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీత అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుద్ధాలు లేని ప్రపంచాన్ని సృష్టించాలని యూఎన్‌ఓ శ్రమిస్తుందన్నారు. అధ్యాపకులు రఘుపతి, పరిమళాదేవి, రవి, అన్వర్ హుసేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

నందికొట్కూరు: నాగలూటి వద్ద మోటర్ సైకిల్‌పై నీలిషకారి ప్రసాద్ అనే వ్యక్తి నాటుసారా తరలిస్తుండగా ఎక్సైజ్ శాఖ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని సీఐ రామాంజనేయులు గురువారం తెలిపారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడి వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ మోటార్ సైకిల్‌పై నాటుసారా తరలిస్తూ పట్టుబడటడంతో 20 లీటర్ల నాటుసారాతో పాటు బైక్‌ను సీజ్ చేశామని చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా జడ్జి 15 రోజుల రిమాండ్‌కు ఆదేశించారన్నారు.ఎస్‌ఐ జబ్రూల్లా, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, కుమారి, పోలీసులు శివన్న, సుధీర్, మధుప్రసాద్, సంధ్యారాణి ఉన్నారు.

క్యూలైన్ పర్యవేక్షకురాలిపై ఫిర్యాదు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని క్యూలైన్ల పర్యవేక్షకురాలు టి.హిమబిందుపై చర్యలు తీసుకోవాలని వృద్ధురాలు పి.సరోజిని ఇన్‌చార్జ్ ఈఓకు గురువారం ఫిర్యాదు చేశారు. దసరా నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ నుంచి శ్రీశైల భ్రమరాంబా అమ్మవారి దర్శనం కోసం వస్తే క్యూలైన్ల వద్ద వృద్ధురాలిని అని కూడా చూడకుండా పర్యవేక్షకురాలు ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించారని, వృద్ధులకు కేటాయించిన క్యూలైన్ల నుంచి అనుమతించాలని వేడుకున్నా నిరాకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

బండిఆత్మకూరు: సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సీఐ రమేష్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభాస్ జూనియర్ కాలేజీలో గురువారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భగా సీఐ మాట్లాడుతూ వాట్సాప్‌లో వచ్చే అనవసర లింకులను క్లిక్ చేయవద్దన్నారు. ఇప్పటికే ఎవరైనా సైబర్ మోసాలకు గురి అయి ఉంటే 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాల గురించి, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, 100, 112 టోల్‌ఫ్రీ నంబర్ల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జగన్‌మోహన్ పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి



రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న డీటీ నాగన్న



శివపురంలో రైతు నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండలంలోని చెరుకుచెర్ల గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో రైతుల నుంచి 96 వినతులు అందాయని మండల సర్వేయర్ కృష్ణుడు, డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌రాజ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్‌ఐ జహంగీర్, వీఆర్వోలు బాలన్న, వెంకటయ్య పాల్గొన్నారు.

పాములపాడు: పొలాల విస్తీర్ణంలో ఉన్న వ్యత్యాసాలు సవరణ చేయాలంటూ రైతులు తహసీల్దార్ సుభద్రమ్మకు అర్జీలు ఇచ్చారు. గురువారం మండలంలోని మద్దూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో 73 మంది రైతులు అర్జీలు ఇచ్చారు. రీ సర్వేలో తమ పొలాల విస్తీర్ణాల్లో తేడాలు వచ్చాయని రైతులు వాపోయారు. రీ సర్వే డీటీ సుప్రియ, మండల సర్వేయర్లు భాస్కర్, కలిముల్లా పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: రెవెన్యూ సదస్సులతో సమగ్ర భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతుల భూసమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని తంగడంచ గ్రామంలో సర్పంచ్ ఈశ్వరరెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 60 మంది రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు అందజేశారు. డీటీ నాగన్న, మండల సర్వేయర్ షాద్‌మాన్ అతీఫ్, వీఆర్వో పాల్గొన్నారు.

కొత్తపల్లి: రీసర్వే గ్రామసభల ద్వారా భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. గురువారం మండలంలోని శివపురం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఇందులో భూ సమస్యలు పరిష్కరించాలని 60 మంది రైతులు అర్జీలు అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ శివన్న పాల్గొన్నారు.

పగిడ్యాల: రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారం నిమిత్తం ఈనెల 22 నుంచి చేపట్టిన గ్రామసభలు గురువారం ముగిశాయని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మురళీ తెలిపారు. చివరి రోజున మండలంలోని పడమర ప్రాతకోట సంత మార్కెట్ ఆవరణలో సర్పంచ్ పిట్టల శేషమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి రీసర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ (డీఐ) ఉమాపతి హాజరయ్యారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో 15 అర్జీలు వచ్చాయని చెప్పారు. ఇంకా రెండు రోజుల పాటు అర్జీలు స్వీకరిస్తామని, షెడ్యూల్ ప్రకారం పాత ముచ్చుమర్రి, మూర్వకొండ, పడమర ప్రాతకోటలో గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించినట్లు స్పష్టం చేశారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగారెడ్డి, వీఆర్వో భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సభలు





గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నరాధిక, రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్

ఆత్మకూరు/రూరల్: రీ-సర్వేలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు. గురువారం మండలంలోని నల్లకాల్వ గ్రామంలో గ్రామ సభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 36 అర్జీలు అందాయని, విచారించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, మండల సర్వేయర్ రాజశేఖర్, వీఆర్‌ఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి బాలు నాయక్, సర్వేయర్లు విజయ్, శ్రీకాంత్, ఎంపీటీసీ శాంతమ్మ, సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

- బండిఆత్మకూరు: మండల పరిధిలోని బి.కోడూరు గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభకు 44 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ దోనీ ఆల్ఫ్రెడ్ తెలిపారు. మ్యుటేషన్‌కు 15, ఎల్‌పీఎంలకు 17, విస్తీర్ణం మార్పునకు 10, సవరణకు 2 దరఖాస్తులు అందాయన్నారు.
- వెలుగోడు: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసగౌడ్ సూచించారు. గురువారం మండల పరిధిలోని అబ్దుల్లాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించి 141 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నవంబర్ చివరిలోపు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, డీఐఓ రవీంద్ర పాల్, మండల సర్వేయర్ ఉపేంద్ర, వీఆర్‌ఓ వెంకట శివుడు పాల్గొన్నారు.

చర్చి సమీపంలో మద్యం దుకాణం వద్దు





మద్యంషాపు వద్ద పోలీసులతో మహిళల వాగ్వాదం, మహిళలు అడ్డుకోవడంతో నిలిచిన మద్యం సీసాల లారీలు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో లూథరన్ చర్చి సమీపంలోని భ్రమరాంబ థియేటర్‌లో మద్యందుకాణాలు ఏర్పాటు చేయవద్దని స్థానిక మహిళలు గురువారం ధర్నాకు దిగారు. రోడ్లపై నిత్యం వాహనాలను నిలిపి బహిరంగంగా మద్యం తాగుతుండటంతో చర్చికి వెళ్లాలంటే భయంగా ఉందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టూ జనావాసాలు ఉన్నాయని, దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ ఇళ్ల వద్దకు తరచూ వచ్చి మద్యం దుకాణం ఎక్కడ అంటూ అడుగుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

మద్యం లోడ్‌తో వచ్చిన వాహనాలను మహిళలు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మహిళలకు సర్దిచెప్పి పంపించేశారు. అనంతరం షాపులు దక్కించుకున్నవారు మద్యం దుకాణాలు తెరిచి విక్రయాలు ప్రారంభించారు.